క్లుప్తంగా

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన విద్యా సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రూపలక్ష్మి తెలిపారు. జనరల్ విభాగంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ఇంగ్లిష్, తెలుగు మీడియాలలో, వొకేషనల్ విభాగంలో సీజీఏ (కంప్యూటర్ గ్రాఫిక్ అండ్ యానిమేషన్) ఇంగ్లిష్ మీడియంలో, ఏఎన్‌టీ (అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్) ఇంగ్లిష్ మీడియంలో, పీఎస్‌టీటీ (ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్) ఇంగ్లిష్ మీడియంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు అధ్యాపకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి తమకు నచ్చిన కోర్సులో చేరవచ్చన్నారు.

'ఉత్తమ బోధనతోనే మంచి విద్య అందుతుంది'

రాయదుర్గం: సమర్థవంతమైన బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ సిరాజ్‌అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలగజేయడం ఉపాధ్యాయులకు అతిపెద్ద, ప్రధానమైన సవాలు అని అన్నారు. వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ అభివృద్ధిలో అందరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం డాక్టర్ రుబీనా రచించిన 'వ్యక్తిత్వ వికాసంలో సహపాఠ్య కార్యక్రమాల పాత్ర' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు.

ఉరేసుకొని మహిళా మృతి



ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్న మమత

భాగ్యనగర్‌కాలనీ: ఉరేసుకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట జనతానగర్‌లో నివాసం ఉంటున్న మమత (24) మూడేళ్ల క్రితం భర్త చనిపోయాడు. వివాహ దినోత్సవ రోజే మమత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శారదాంబకు పుష్పఫలాదివాసం



పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు





పుష్పఫలదివాసం అనంతరం అమ్మవారు, ప్రతిష్ఠాపన అనంతరం శ్రీశారదా మాత

మోతీనగర్: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని శ్రీశృంగేరి శారద శంకర మఠం మోతీనగర్ శాఖ కార్యనిర్వాహణ అధికారి సీఎస్ఆర్ మూర్తి అన్నారు. శుక్రవారం శారదా పీఠంలో శ్రీశారదాంబ నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గురువందనం గణపతి పూజ, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, శారదాంబ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహన్యాస పూజ అనంతరం ప్రథమ దర్శనం, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల సత్కారం భక్తులకు మహా దర్శనం శ్రీశారదాంబ నగర సేవతో కార్యక్రమం ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

దేవాలయాల సంరక్షణకు పాటు పడాలి





మాట్లాడుతున్న శ్రీరాధా మనోహర్‌దాస్

మోతీనగర్: ఆలయ నిర్మాణం, పునర్ నిర్మాణానికి ధనవస్తు రూపేణా సహాయ సహకారాలు అందించటంతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములైతే వేయి జన్మల పుణ్యం లభిస్తుందని శ్రీశివరామాంజనేయ దేవాలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో నిర్మించిన దేవాలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ అనంతరం శ్రీరాధా మనోహర్‌దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సనాతన ధర్మాన్ని అందరూ పాటించాలన్నారు. పాశ్చాత్య ధోరణులకు దూరంగా ఉంటూ భారతీయ సంప్రదాయాలను నిలబెట్టాలన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మికంగానే కాకుండా సామాజిక అభివృద్ధికి కూడా ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేవాలయాల అభివృద్ధికి వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● సమ్మర్ క్యాంపుల్లో పిల్లల సందడి ● 31 కేంద్రాల్లో 16 రకాల ఆటల్లో ఉచితంగా శిక్షణ

మూసాపేట: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌లు ఎంతో ఉత్సాహంగా జరుగుతున్నాయి. కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తిరోజు సమ్మర్ క్యాంపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్రికెట్, టెన్నిస్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, హాకీ, చెస్ వంటి ఆటలు ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా ఈనెల 31వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్‌లు జరుగుతాయి. మొత్తం 16 రకాల ఆటలు నేర్పిస్తారు. మూసాపేట సర్కిల్ పరిధిలో 31 కేంద్రాల్లో కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని 5 కేంద్రాల్లో జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు కొనసాగుతున్నాయి. ఈ సమ్మర్‌క్యాంపులు ప్రతిరోజు ఉదయం 6.15 నుంచి 8.15 గంటల వరకు కొనసాగుతాయి. అక్కడ జరుగుతున్న ఆటను బట్టి సమయాల్లో మార్పు ఉంటుంది.

ఆట పేరు -- కోచింగ్ కేంద్రం

బాల్ బ్యాడ్మింటన్ : రమ్యాగ్రౌండ్స్, కేపీహెచ్‌బీకాలనీ

బాస్కెట్ బాల్ : కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్,వసంత్‌నగర్

క్రికెట్ : కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్ ప్లేగ్రౌండ్-2, భువన విజయం ప్లే గ్రౌండ్

కరాటే : కేపీహెచ్‌బీకాలనీ భువన విజయం ప్లేగ్రౌండ్, 6వ ఫేజ్ ప్లేగ్రౌండ్, గాయత్రినగర్ పార్కు, పాండురంగనగర్ పార్కు

రోలర్స్ స్కేటింగ్ : బతుకమ్మ కుంట

షటిల్ బ్యాడ్మింటన్ : కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజు, రమ్యా గ్రౌండ్, వసంత్‌నగర్, ఆంజనేయ నగర్, గాయత్రినగర్, ధనలక్ష్మి సెంటర్, 5వ ఫేజు డీమార్టు వద్ద, రమ్యాగ్రౌండ్-2 ఇండోర్ స్టేడియం, ప్రశాంత్‌నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ ప్లేగ్రౌండ్స్‌లో

టెన్నిస్ : కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజు, ఆంజనేయనగర్ ప్లే గ్రౌండ్, వసంత్‌నగర్, కేపీహెచ్‌బీ 5వ ఫేజు ప్లేగ్రౌండ్ రోసరీ స్కూల్ ఎదురుగా

వాలీబాల్ : కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజు, భరత్‌నగర్ యువసేన గ్రౌండ్, రమ్యా ప్లే గ్రౌండ్, భరత్‌నగర్ శివసేన గ్రౌండ్, అల్లూరి సీతారామరాజు ప్లే గ్రౌండ్, చంద్రశేఖర్ ప్లే గ్రౌండ్, వసంత్‌నగర్ ప్లే గ్రౌండ్, ధనలక్ష్మి సెంటర్, కేపీహెచ్‌బీ 5వ ఫేజు డీమార్టు వద్ద, ప్రశాంత్‌నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ ప్లే గ్రౌండ్స్

కబడ్డీ : ఆస్‌బెస్టాస్ కాలనీ ప్లే గ్రౌండ్

ప్రైవేట్ సెంటర్లకు దీటుగా..

ప్రతి సంవత్సరం జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తర్ఫీదు పొందుతున్నారు. వారిలో ఆటలపై ఆసక్తి పెరుగుతోంది. మౌలిక వసతుల కల్పనతో ప్రైవేట్ సెంటర్లకు దీటుగా నిర్వహిస్తున్నాం.

– వీరానందు, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ అధికారి

మానవత్వంతో సేవలందించేది నర్సులే...



అమోర్ ఆస్పత్రిలో జరిగిన నర్సుల దినోత్సవంలో పాల్గొన్న నర్సులు

నర్సులంటే నడిచొచ్చే దేవతలని, ముఖ్యంగా రోగుల విషయంలో వారు చాలా కీలక పాత్ర పోషిస్తారని అమోర్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ కిశోర్ బి.రెడ్డి అన్నారు. శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మంచం మీద కదలలేని పరిస్థితుల్లో ఉండే రోగులకు మానవత్వంతో సేవలందించేది నర్సులేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రీతమ్మా జోసెఫ్, పలు విభాగాలకు చెందిన నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– కూకట్‌పల్లి

ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా కేసీఆర్ నిర్ణయాలు



గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్

అల్విన్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా హనుమాన్‌నగర్, దీనబంధు కాలనీల్లో గడప గడపకు బీజేపీలో భాగంగా రవికుమార్‌యాదవ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాలనీల్లో గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి కనిపిస్తోందే తప్ప ప్రస్తుతం జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం అభివృద్ధిని కుంటుపరుస్తూ అవినీతిని ప్రోత్సహిస్తోందని తెలిపారు. వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధి చేస్తున్నామన్న స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు అభివృద్ధిపై శ్వేతపత్రం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు యాదవ్, శ్రీహరి, గోవర్ధనాచారి, శ్రీనివాస్ పటేల్, వెంకటేష్, శ్రీధర్ పటేల్, గోపాల్‌రావు పాల్గొన్నారు.

టీవీఆర్ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత

జీడిమెట్ల: టీవీఆర్ పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణతతో పాటు 10జీపీఏ పాయింట్లు సాధించడం సంతోషంగా ఉందని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. పరీక్షకు హాజరైన అందరూ పాసవ్వడంతో పాటు ఆర్తిశర్మ, సాయినాథ, శ్రీమహతి, కావ్య, శృతి, నవీనలు 10జీపీఏ పాయింట్లు సాధించారు. మరో 35మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ... టీవీఆర్ పాఠశాల విద్యార్థులు పట్టుదలతో చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని అన్నారు.

గంజాయి మత్తులో యువకుడు హల్‌చల్



రోడ్డుపై రక్తం మరకలతో మహేష్

జగద్గిరిగుట్ట: ఓ వ్యక్తి గంజాయి సేవించిన మత్తులో గొంతు కోసుకుని రోడ్డుపై హల్‌చల్ చేసిన సంఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట దీనబంధు కాలనీకి చెందిన మహేష్(23) దొరికిన పని చేస్తూ వచ్చిన డబ్బుతో గంజాయి తాగుతుంటాడు. గురువారం రాత్రి గంజాయి మత్తులో మహేష్ తన బంధువులు తనకు అన్యాయం చేసారంటూ రోడ్డుపైకి వచ్చి అరుస్తూ బ్లేడుతో గొంతుకోసుకున్నాడు. అనంతరం తూగుతూ రోడ్డుపై నడుస్తూ పొంతనలేని మాటలు మాట్లాడుతూ వాహనాలకు అడ్డుగా నిలిచాడు. రక్తం మరకలతో ఉన్న మహేష్‌ను చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం స్థానికులు పట్టుకుని చికిత్స కోసం మహేష్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహేష్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

ఐడీపీఎల్ స్క్రాప్ టెండర్లలో స్కామ్ జరగలేదు

జనరల్ మేనేజర్ రామకృష్ణారెడ్డి వెల్లడి

బాలానగర్: బాలానగర్ పరిధిలోని ఐడీపీఎల్‌లో స్క్రాప్ టెండర్లలో స్కామ్ జరిగినట్లుగా సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై ఐడీపీఎల్ జనరల్ మేనేజర్ వై. రామకృష్ణారెడ్డి స్పందించారు. సోషల్ మీడియాలో రూ.1000 కోట్ల కుంభకోణం అని వస్తున్న వార్తలు అంతా నిరాధారమైనవని తేల్చి చెప్పారు. స్క్రాప్ టెండర్లు ఆఫీస్ పరిధిలో జరిగే ప్రక్రియ అని అంతా పారదర్శకంగా ఉంటుందన్నారు. ఎంఎస్‌టీసీ మెటల్ స్క్రాప్ (ట్రేడ్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో ఈ-టెండర్స్‌లో 33 మంది ఆక్షన్‌లో పాల్గొన్నారని ఎక్కువ కోడ్ చేసిన వారికి టెండర్ వస్తుందని తెలిపారు. ముంబాయికి చెందిన కంపెనీ వారు ఈ టెండర్‌ను దక్కించుకున్నారని తెలిపారు.

డీఈఓకు ఎన్‌టీవీఎస్ నాయకుల ఫిర్యాదు

భాగ్యనగర్‌కాలనీ: నిబంధనలకు విరుద్ధంగా మాదాపూర్‌లో నడుస్తున్న రీజనెన్స్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి శక్తి రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా డీఈఓకు శుక్రవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయికిరణ్, విశాల్, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ బస్సు రూట్లు మార్పు

● 3 నెలల పాటు కొనసాగింపు ● నేటి నుంచి ఆగష్టు 10 వరకు.. ● శిల్పా లేఅవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో రోడ్డు మూసివేత

రాయదుర్గం: ఆర్టీసీ బస్సు రూట్లు మారాయి. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శిల్పా లేఅవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రోడ్డును 90 రోజులపాటు మూసివేస్తున్న నేపథ్యంలో ఈ మార్పులకు ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు ఈ మార్పు అమలులో ఉంటాయి.

◆ రూట్ నంబర్ 216కె/ఎల్ బస్సును లింగంపల్లి నుంచి మెహిదీపట్నం వెళ్ళే బస్సు... రాడిసన్ హోటల్ ఎక్స్‌రోడ్డు నుంచి మీనాక్షి టవర్స్, ఐకియా, బయోడైవర్సిటీ ఎక్స్ రోడ్డు రూట్ ద్వారా రాకపోకలు జరుగుతాయి.

◆ రూట్ నంబర్ 221 బస్సు మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మంచిరేవుల బస్సును... రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్ నుంచి గచ్చిబౌలి వరకు రాకపోకలు జరుగుతాయి.

◆ రూట్ నంబర్ 10 హెచ్‌డబ్ల్యూ బస్సు సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్.. బస్సును రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్, విప్రో సర్కిల్ మీదుగా రాకపోకలు చేస్తాయి.

◆ ఈ రూట్ మార్పులను 90 రోజులపాటు అమలు చేస్తామని, ప్రయాణికులు గమనించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

ఇల్లు అద్దెకు కావాలంటూ గొలుసు చోరీ

- 4 తులాల బంగారు గొలుసు తస్కరణ
- వృద్ధురాలి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ: ఇల్లు అద్దెకు కావాలంటూ ఇంట్లోకి ప్రవేశించిన ఓ యువకుడు ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట రోడ్డులోని ప్రశాంత్‌నగర్‌లో మహాలక్ష్మమ్మ (58) తన కొడుకుతో పాటు నివాసం ఉంటుంది. అయితే తన ఇంట్లో ఒక పోర్షన్‌లో అద్దెకు ఇచ్చేందుకు గేటు బయట టు-లెట్ బోర్డు పెట్టి దానిపై ఫోన్ నంబర్‌ను రాసింది. శుక్రవారం ఉదయం ఓ యువకుడు ఫోన్ చేసి ఇల్లు అద్దెకు కావాలని అడగగా తన అబ్బాయి ఇంట్లో లేడని సాయంత్రం రావాలని తెలిపింది. ఇంట్లో మధ్యాహ్నం సమయంలో ఆ యువకుడు మహాలక్ష్మమ్మ ఇంటిలోకి ప్రవేశించి ఆమె వంట గదిలో పనిలో ఉండగా ఇళ్లు అద్దెకు కావాలని మాటలు కలిపాడు. ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసును తెంచుకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె ప్రతిఘటించటంతో ఆమె వీపుపై పిడిగుద్దులు గుద్ది పక్కనే ఉన్న శెనగపిండిని మహాలక్ష్మమ్మ కళ్లలో చల్లి మెడలోని బంగారు గొలుసును తెంచుకొని బయట గడియపెట్టి పారిపోయాడు. ఇరుగు పొరుగు సహకారంతో మహాలక్ష్మమ్మ కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా దొంగను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

పేదలకు డబుల్ ఇళ్లు ఇచ్చే వరకు పోరాడతాం



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు పన్నాల హరీష్‌రెడ్డి, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు

● మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ● లబ్ధిదారులకు డబుల్ ఇళ్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్

మూసాపేట: తెలంగాణలో పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామంటూ సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లగా మోసం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకులు ఆరోపించారు. కేంద్రం 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే, కేసీఆర్ సర్కార్ లెక్కల ప్రకారం కేవలం 7వేల ఇళ్లు మాత్రమే ఇచ్చి కాలయాపన చేస్తోందని విమర్శించారు. డబుల్ బెడ్ ఇళ్ల కేటాయింపులో కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం మూసాపేటలో బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఆత్మగౌరవ దీక్ష శుక్రవారం ముగిసింది.

◆ అనంతరం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, అర్సనపల్లి సూర్యారావులు శుక్రవారం మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో డీసీకి వినతిపత్రం అందజేశారు. పేదల కోసం కేంద్రం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేసీఆర్ సర్కార్ వెంటనే అందజేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకుండా పేదలను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెడుతోందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసే వరకు బీజేపీ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, నాయకులు శ్రీకర్‌రావు, పద్మయ్య, పిట్ల మనోహర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ఇళ్ల జోలికి వస్తే ఊరుకోం

ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధి బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీలో పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. బస్తీలో ప్రతి ఇంటికీ తాను రక్షణగా ఉంటానని స్పష్టం చేశారు. సంబంధిత శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన ఎక్స్‌టెన్షన్‌లో పర్యటించారు. కొందరు తమ ఇళ్లను ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఇళ్లను విక్రయించాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొందరు తమకు తామే ఇళ్లను విక్రయించుకుంటున్నారని, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బస్తీవాసులంతా కలసికట్టుగా ఉండాలని, ఆక్రమణదారులు ఎవరైనా దౌర్జన్యానికి దిగితే రాళ్లతో తరిమికొట్టాలన్నారు. ఇళ్లు అమ్ముకునేందుకు ప్రయత్నించే వారితో గానీ, గోదాములు ఏర్పాటు చేసుకున్న వారితో గానీ తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పేదల ఇళ్ల జోలికి వస్తే కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. కోర్టు స్టేటస్‌కో ఇచ్చినప్పటికీ కొందరి ఇళ్లను ఎలా కూల్చివేశారంటూ ఎమ్మెల్యే నిలదీశారు. సీవరేజీ, మంచినీటి పైప్‌లైన్లు వేశారని, అయితే రోడ్లు వేయడంలో ఇబ్బంది ఏమిటన్నారు. రోడ్లు వేయని పక్షంలో అధికారి ఇంటి ముందు కూర్చొని ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భ్యానగర్‌కాలనీ, జలవాయువిహార్, అడ్డగుట్టలలో ప్రజా సమస్యలే పరిష్కారంగా.. అభివృద్ధే లక్ష్యంగా శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులతో కలిసి 1 కోటి 37 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన యూజీడీ పైపులైన్, స్ట్రామ్ వాటర్ డ్రైన్ 600 ఎంఎం డయా పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకంలో, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెడుతామని అన్నారు. బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు.

◆ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ... హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని పక్కా ప్రణాళికతో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్‌డ్రైన్, అండర్‌గ్రౌండ్ నిర్మాణం వంటి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు, ఏఈ రాజీవ్, మేనేజర్ ప్రశాంతి, వర్కు ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, దేవి, కాలనీవాసులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ